నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, సోమవారం 25 మార్చి 2024 | NIRMAL

## రంగుల కేళీ.. హోలీ..

**నేడు వసంతోత్సవం**



ఆదిలాబాద్ రూరల్, మార్చి 24 : 'హోలీ.. హోలీల రంగ హోలీ ..చెమ్మ కేళిల హోలీ' అంటూ ఏడాదికోసారి నిర్వహించుకునే రంగుల వేడుకకు ఉమ్మడి జిల్లా ప్రజానీకం సిద్ధమైంది. చిన్నా, పెద్ద ఆనందడోలికల్లో మునిగి తేలనుండగా, మోములన్నీ వర్ణ శోభితం కానున్నాయి. స్నేహితులు, ఇంటిల్లిపాది, బంధువులతో ఊరూవాడా సందడి నెలకొననుంది. పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున నిర్వహించే ఈ వసంతకేళిలో సహజ రంగులు వాడాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

### ఉత్సాహంగా వసంతోత్సవం

వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి దీన్ని 'వసంతోత్సవం' అని కూడా పిలుస్తారు. హోలీ అంటే అగ్ని కానీ, అగ్నితో పునీతమైనది అని చెబుతుంటారు. ఇది చెడుపై మంచి సాధించిన విజయాన్ని కూడా సూచిస్తుంది. ఇది హిరణ్యకశ్యపుడిపై నారసింహుడి విజయంగా కూడా పేర్కొంటారు. జిల్లాలో ఆదివారం కాముని పున్నం నిర్వహించారు. కామ దహనంతో హోలీ వేడుకలు ప్రారంభమయ్యాయి.

## యువత ఉన్నతంగా ఎదగాలి..

**బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న**



ట్రోఫీని అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, మార్చి 24 : క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ యువత ఉన్నతంగా ఎదగాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. జైనథ్ మండలంలోని కంట గ్రామంలో గణేశ్ యూత్ మండల్ ఆధ్వర్యంలో, జోగు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతగా నిలిచిన జట్టుకు జోగు ఫౌండేషన్ తరపున రూ.25 వేలు అందించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, గంట రమేశ్, ఇజ్జగిరి నారాయణ, బాలాజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.



బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సీతక్క

## బీజేపీ అభివృద్ధి చేసింది శూన్యం

- దేవుళ్లు, మతం పేరిట రాజకీయాలే అధికం
- సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నది..
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

భైంసా/దిలావర్‌పూర్/బాసర, మార్చి 24 : కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు గౌరీ ఫంక్షన్ హాల్‌లో ముథోల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఇంటింటికీ అక్షింతలు మాత్రమే పంచిందన్నారు. దేవుళ్లు, మతం పేరిట పీఎం నరేంద్రమోదీ, పార్టీ లీడర్లు రాజకీయాలు చేయడమేకాకుండా.. ఇప్పుడు ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమాచార హక్కు చట్టం తీసుకవస్తే, బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. అనంతరం కదిలి పాపహరేశ్వర ఆలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాత అన్నపూర్ణదేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, నాయకులు ఉన్నారు.

### ఎలక్ట్రాన్ మీడియా నిరసన

భైంసా, మార్చి 24 : పట్టణంలోని గౌరీ శంకర్ ఫంక్షన్‌లో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మీడియాకు సరైన గౌరవం దక్కలేదంటూ, మీడియా పాయింట్ ఏర్పాటు చేయలేదని ఎలక్ట్రాన్ మీడియా సభ్యులు బయట నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు గమనించి లోపలికి రావాలని కోరారు.

## నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

తాంసి(తలమడుగు), మార్చి 24 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎంహెచ్ 26 సీఈ 7458 నంబరు గల వాహనంలో రూ.2 లక్షలు నాందేడ్ తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ముక్తార్ జాగిర్దార్ రూ.2 లక్షలను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని సీఐ ఫణిందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ధనశ్రీ, తనిఖీ సిబ్బంది మాణిక్ ప్రభు, బి.సురేందర్, జె.దత్తు, పి.శేషరావ్ పాల్గొన్నారు.

# పూత లేదు.. కాత రాదు..

**మామిడి రైతుల ఆశలు గల్లంతు**

- గతేడాది దెబ్బ తీసిన పండు ఈగ
- ఈ యేడాది ప్రతికూల వాతావరణం
- రూ.400 కోట్ల వ్యాపారంపై ప్రభావం
- కొనడానికి ముందుకురాని వ్యాపారులు
- ఆందోళనలో అన్నదాతలు

● 'కాయ' కనిపించట్లే..



పూతకురాని మామిడి చెట్లు

*మామిడి రైతుల ఆశలు గల్లంతయ్యాయి. ఏ తోటకెళ్లి చూసినా.. ఒక్క మామిడి కాయ కనిపించడం లేదు. కనీసం పెట్టుబడి తిరిగి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దిగుబడి లేదని తెలిసి మామిడి కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు తోటల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు రూ.400 కోట్ల వ్యాపారంపై నీలినీడలు కమ్ముకున్నాయి.*

మంచిర్యాల, మార్చి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 26 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగయ్యాయి. జిల్లాలో బంగినపల్లి, దసేరి, లంగ్డా, చెక్కర గుంటి, చెరుకు రసాల వంటివి 50 రకాలు సాగవుతున్నాయి. వీటితోపాటు పచ్చడి రకాలు కూడా ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే యేటా జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల పంట చేతికొచ్చేది. కానీ.. ఈ ఏడాది ఐదు శాతం కాయలు కూడా తోటల్లో కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రతికూల వాతావరణం.. తెగుళ్లతో ఇబ్బందులు..

వాతావరణంలో మార్పులు మామిడి పంటలపై తీవ్రప్రభావం చూపాయి. ఆశించిన మేర వర్షాలు కురవక పోవడం, నేలలో తేమ శాతం పడిపోవడంతో సకాలంలో చెట్లు చిగురించక.. పూత రాకుండా పోయింది. దీనికితోడు తెగుళ్లు వచ్చాయి. మామిడి చెట్లు చిగురించే సమయంలో ఆకులపై లీఫ్ వెబ్బర్(బల్లి పాతర) వచ్చింది. చిగురించే కొనలపై బల్లిపాతర చుట్టుకోవడంతో పూతకు అడ్డుపడింది. దీంతో దాదాపు చెట్టు నిండా రావాల్సిన పూత 20 శాతం కూడా రాలేదు. పైగా అది కూడా చాలా ఆలస్యంగా రావడంతో కొద్దిరోజులుగా మండిపోతున్న ఎండలకు నేల రాలాయి. దీంతో పూత, కాత కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. సాధారణంగా నవంబర్‌లో రావాల్సిన పూత జనవరి చివరి వరకు కూడా రాలేదంటున్నారు. పిందే పట్టాల్సిన పూత కూడా చివరి దశలో రాలిపోతుందంటున్నారు. పోనీ ఆలస్యంగా పూత వస్తుందనుకుంటే పొగ మంచు, చలి తీవ్రత, మబ్బులు రావడంతో ఏం చేయలేని పరిస్థితి వచ్చిందంటున్నారు. అసలు పూత, కాత రాకుండా పోయిందని బోరుమంటున్నారు. గతేడాది పండు ఈగ ప్రభావంతో దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల పంట నేలపాలయింది. ఇప్పుడేమో లీఫ్ వెబ్బర్, వాతావరణ ప్రభావంతో రైతులు కోలుకోలేని దెబ్బతింటున్నారు. పూత ఆలస్యంగా రావడంతో మామిడి వ్యాపారులు ఎవరు తోటలపై ఆసక్తి చూపడంలేదు. పూత సమయంలోనే వచ్చి రైతులతో మాట్లాడుకుని అడ్వాన్సులు ఇచ్చే నాగ్‌పూర్ వ్యాపారులు మామిడి తోటలవైపు కన్నెత్తి చూడడం లేదు. లోకల్ వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వచ్చే ఐదు శాతం పంటను ఎలా విక్రయించాలో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు.

### 50 ఎకరాలు కౌలుకు తీసుకున్న..



*నేను 50 ఎకరాల మామిడి తోటలు కౌలుకు తీసుకున్న. పూత ఆలస్యంగా వస్తుందని కాయ మంచిగా కాయాలని మందులు పిచికారీ చేసిన. పూత నిలువక, కాయలు పడలేదు. అక్కడక్కడా కాసిన కాయ కూడా నిలుస్తుందో లేదోనన్న భయం ఉంది. గతేడాది 200 ఎకరాలకు పైగా తోటలను గుత్తకు తీసుకుని వ్యాపారం చేశా. పండు ఈగతో చాలా నష్టపోయా. ఈసారైనా పూత మంచిగా వస్తుందనుకుని ఆశపడ్డా. ఇప్పటి వరకు తోటలో చెట్లపై అనుకున్నంత కాత లేదు. ఎండలు ముదిరితే చెట్లపై ఒక్క పిందే కూడా ఉండదు. ఇప్పుడు ఏం చేయాలో అర్థమైతలేదు.*

**- గన్న అంజన్న, మామిడి రైతు, వ్యాపారీ.**



చెట్టునిండా పూత ఉండి కాతలేని చెట్టు

### చెట్లకు కాయలు లేవు..



*ఈ ఏడాది మామిడి పూత అనుకున్నంతగా రాలేదు. ఇప్పటికే పిందే పట్టి వంద గ్రాముల బరువు పెరగాలి. ఎక్కడ చూద్దామన్న కాయ కనిపించడం లేదు. ఆలస్యంగా పూత వస్తే కాత నిలవదు. పంట అనుకున్నంత రాదు. తోటలను నమ్ముకుని ఉన్న రైతులకు ఈ యేడు నష్టమే వచ్చింది. ప్రతి యేట ఏదో ఒక కారణంతో నష్ట పోతున్నాం. ఐదెకరాల తోటలో కనీసం పది చెట్లు కూడా పూర్తిగా పూతకు రాలేదు. పూత వచ్చిన కాయ రావడం లేదు. ఎన్ని మందులు కొట్టినా రోగాలు పోలేదు. చెట్టు నిండా బల్లి పాతర పట్టి పూతరాకుండా చేసింది. బల్లి పాతర పోవడానికి వేల రూపాయల మందులు కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. దాదాపు అరవై ఎకరాల తోటలను కౌలుకు తీసుకున్నా.. లక్షల పెట్టుబడి పెట్టినా.. లాభం లేకుండా పోయింది. ఎకరానికి కనీసం రెండు క్వింటాళ్లు కూడా పంట వచ్చే పరిస్థితి లేదు.*

**- మెండె నర్సయ్య, మామిడి రైతు.**



● స్వర్ణ ప్రాజెక్టు



● మత్తడి వాగు ప్రాజెక్టు

# డెడ్‌స్టోరేజీ

- అడుగంటుతున్న సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులు
- పడిపోతున్న భూగర్భ జలాలు.. తాగు, సాగు నీటికి కష్టమే..

*ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాత్నాల, తాంసి మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టులు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. యేటా వేసవి చివరలో డెడ్‌స్టోరేజీకి చేరుకోవాల్సిన ప్రాజెక్టులు.. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే నీటి నిలువలు అడుగంటాయి. సాత్నాల ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 280.75 మీటర్లకు చేరుకున్నది. మత్తడి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా 272.90 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. మే నెలలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటే ప్రమాదం ఉంది. ఫలితంగా భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతాయి. దీంతో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. మూగజీవాలకు కూడా తాగునీటి తిప్పలు తప్పేటట్లు లేవు.*

**- ఆదిలాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ)**

# ఇప్పపూల గుబాళింపు

- వసంత ఋతువు రాకతో సీజన్ ప్రారంభం
- పోషకాలు మెండుగా ఉండడంతో తినుబండారాల్లో వాడకం
- ఇప్పకాయల నూనె తయారీతో మహిళలకు ఉపాధి
- శుభ, అశుభ కార్యాల్లో ఇప్పసారా వినియోగం
- రక్తహీనతను పారద్రోలే దివ్యమైన ఔషధం
- గిరిజన కార్పొరేషన్ సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలి

*వసంత ఋతువు రాకతో ఏజెన్సీలో ఇప్పపూల గుబాళింపు మొదలైంది. ఈ పువ్వును ప్రసాదాలు, తినుబండారాల్లో వినియోగిస్తారు. ఇప్పకాయల నుంచి నూనె తయారు చేస్తూ గిరి మహిళలు ఉపాధి పొందుతున్నారు. పోషకాలు మెండుగా ఉన్నందున వీటి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వీరి జీవన విధానంలో ప్రత్యేకత సంతరించుకున్న ఇప్పచెట్టు పేరిట పండుగ కూడా నిర్వహిస్తుంటారు.*



ఇప్పపూలు సేకరించి తీసుకొస్తున్న ఆదివాసీ మహిళలు



ఇప్పచెట్టు కింద పూలు సేకరిస్తున్న చిన్నారులు

నార్నూర్, మార్చి 24 : గిరిజనుల జీవన విధానంలో ఇప్పపూల చెట్లు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. వసంత ఋతువు ప్రారంభంలో ఇప్పచెట్ల నుంచి పూలు వస్తాయి. తెల్లవారుజామున నేలరాలిన పూలు గుబాళిస్తాయి. ఆదివాసులు తమ ఇండ్ల పరిసరాల్లో ఈ చెట్లను పెంచుతున్నారు. పూలు రాలే సమయంలో ముందుగానే చెట్టు చుట్టూ చెత్తను తొలిగించి నేలను శుభ్రం చేస్తారు. ఇప్పపూలు తెలుపు రంగులో ఉండడంతో ఆకులతో నిండి న చెత్తలో రాలితే కనబడవు. శుభ్రం చేసిన నేల పై సువాసన వెదజల్లుతూ రాలిన ఇప్పపూలు వడగళ్ల మాదిరిగా స్వచ్ఛంగా కనిపిస్తాయి. ప్రధానంగా మార్చి నుంచి మే వరకు ఇప్పపూలు లభిస్తాయి. నేలరాలిన ఇప్పపూలను జీవాలు తినకుండా తెల్లవారగానే ఇంటిల్లిపాది కలిసి సేకరించి ఎండబెడతారు. పూలు రాలడం పూర్తికాగానే ఇప్పచెట్టుకు కాయలు కాస్తాయి. వీటిని కూడా ఎండబెట్టి బద్దగా చేసి ఇప్పనూనె తయారు చేస్తారు. పెద్ద ఇప్పచెట్టు నుంచి 100 కిలోలకు పైబడి పువ్వు లభిస్తుంది.

### ప్రయోజనాలు..

బాగా ఎండబెట్టిన ఇప్పపూలను ఆలయాల్లో ప్రసాదంగా వినియోగిస్తుంటారు. ఇప్ప పువ్వులో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. రక్తహీనత నివారణకు దోహద పడుతుంది. ప్రస్తుతం ఇప్పపూలతో తినుబండారాలను తయారు చేస్తున్నారు. వాటితో హల్వా, కేక్, జాం, లడ్డూ వంటివి ప్రధానమైనవి.

### సంప్రదాయంగా ఇప్పసారా..

ఆదివాసీ గిరిజనులు సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగంగా పండుగలు, శుభకార్యాల్లో ఇప్ప సారాను వినియోగిస్తారు. రసాయనాలు, ఇతర పదార్థాలు వినియోగించకుండా బెల్లంఊటతో కలిపి ఇప్పసారా తయారు చేస్తారు. శుభకార్యాల సమయంలో తమ ఇళ్లకు వచ్చే బంధువులకు ఇప్పసారా ఇస్తారు. శుభ కార్యాలు, దినకార్యాలకు ఇప్పసారాను తీసుకువెళ్లడం ఆనవాయితీ.



ఇంటి పరిసరాల్లో ఎండబెట్టిన ఇప్పపూలు

### ఇప్పపువ్వు పండుగకు ప్రాధాన్యం



*ఆదివాసులు సంప్రదాయబద్ధంగా పూర్వం నుంచి జరుపుకునే ఇప్పపువ్వు పండుగకు ప్రాధాన్యత ఉంది. ఈ పండుగలో శాస్త్రీయ ఆలోచన విధానం దాగి ఉంది. సైన్స్ ఆదివాసులకు అందుబాటులో లేని కాలం నుంచి ఇప్పపువ్వు పండుగ రోజు కార్తెలను, పాదాలను లెక్కించి ఆ సంవత్సరం ఏ కార్తె ఏ పాదంలో ఎక్కువ వర్షాలు కురుస్తాయో లెక్కించే వారు. ఏ కార్తెలో విత్తనాలు వేయాలి. ఏఏ పంటలు పండించాలో నిర్ణయించేవారు.*

**- మెస్రం రూప్‌దేవ్, గ్రామపటేల్, మాన్కాపూర్**

### సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలి..



*గిరిజనులు యేటా మార్చి నుంచి మే నెలలో ఇప్పపువ్వును సేకరిస్తారు. ఆ పువ్వును ఎక్కడ అమ్మాలో తెలియక దళారుల చేతులో మోసపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన కార్పొరేషన్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలి.*

**- తోడసం నాగోరావ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్.**